

ఆర్టీసీ డ్రైవర్.. నో ఫోన్

ఆర్టీసీ సంస్థ డ్రైవర్లకు సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధిస్తూ చర్యలు చేపట్టింది.

వివరాలు 8లో ▸



ఏ ఎన్నిక ముందు.!

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొస్తాయి? ప్రభుత్వం రోజుకో లీకుతో గ్రామస్థాయిలో నాయకులు అయోమయంలో పడ్డారు.

వివరాలు 8లో ▸



పనుల్లో వేగం పెంచండి

నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆదేశించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చెరకుకు బోనస్ ఇవ్వాలి

బీకేఎస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: చెరకు పంటకు ఖర్చులు పెరిగి విస్తీర్ణం తగ్గుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టన్నుకు రూ.500 బోనస్ ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు. అలాగే.. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇనేష్



ఇనేష్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ శాఖ సంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఐ.ఇనేష్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇనేష్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల శాఖలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఏడీగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)లోనూ ఆయన పనిచేశారు. రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఇనేష్‌కు జిల్లాలోని పలువురు గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎకరాకు రూ.20 వేలు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: భారీవర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నాగల్‌గిద్ద మండలం అవుదత్‌పూర్, వడ్‌గాం, ఏస్గి గ్రామాల పంట పొలాలను సోమవారం పరిశీలించారు. వరి, పత్తి, పెసర, మినుము తదితర పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. ఎకరాకు రూ.20వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి యేడు మంజీరా పరివాహక ప్రాంత రైతులు నష్టపోతున్నారని, ప్రతి యేడు ఎకరాకు రూ.10వేలు చెల్లించాలని కోరారు.

పరిహారం మంజూరు చేయాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు నాయకులు

మునిపల్లి(అందోల్): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం మంజూరు చేయాలని మంజీరా రైతు సమైఖ్య జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్ కోరారు. సోమవారం మండలంలోని పాల్కంపల్లి గ్రామ శివారులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున పంట నష్ట పరిహారం మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లన్న, శేఖర్, చంద్రప్పా, సతీష్, శ్రీహరి, శంకర్‌తో పాటు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మోడల్ స్కూల్ ఉద్యోగుల డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి జోన్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమతోపాటు విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు బడ్జెట్ ఉన్నప్పటికీ, తమకు బడ్జెట్ కేటాయించడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని తమకు ప్రతినెల వేతనం అందే విధంగా చూడాలన్నారు.



టీచర్ల పదోన్నతుల్లో అవకతవకలు!

దివ్యాంగ సంఘాల ఫిర్యాదు

- అర్హులకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన
- ఫిర్యాదు అందిన వారి పదోన్నతిని తాత్కాలికంగా నిలిపివేత
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం సరోజినిదేవి ఆసుపత్రికి లేఖ



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా దివ్యాంగుల కోటాలో ఇచ్చిన పదోన్నతులపై ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వైకల్యం లేకపోయినా.. దివ్యాంగ ధ్రువీకరణ పత్రాన్ని పొంది పదోన్నతులు దక్కించుకున్నారని జిల్లా విద్యాశాఖకు దివ్యాంగుల సంఘాలు ఫిర్యాదులు చేశాయి.

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి:

జిల్లాలో వివిధ చోట్ల పనిచేస్తున్న 221 మంది ఉపాధ్యాయులకు వారం రోజుల క్రితం పదోన్నతులు వచ్చాయి. ఇందులో 190 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా, 31 మంది స్కూల్ అసిస్టెంట్‌లకు పీజీ హెచ్‌ఎంగా పదోన్నతులు లభించాయి. సీనియార్టీ రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఈ పదోన్నతులు లభించాయి. అయితే దివ్యాంగుల కోటాలో అంధత్వ ధ్రువీకరణ పత్రంతో పదోన్నతి పొందిన ఓ ఉపాధ్యాయుడికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉందని, రంగారెడ్డి జిల్లా నుంచి తాను విధులు నిర్వర్తించే పాఠశాలకు నిత్యం తన కారులో వంద కిలోమీటర్ల దూరం నుంచి కారు నడుపుకుంటూ వచ్చి వెళ్లే వ్యక్తికి అంధత్వం ఎలా ఉంటుందని దివ్యాంగుల సంఘాలు ఫిర్యాదులు చేస్తున్నాయి. ఆధారాల కోసం ఔటర్ రింగ్ రోడ్డుపై ఉన్న టోల్ గేట్లలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే బండారం బయట పడుతుందని పేర్కొన్నారు.

హోల్డ్‌లో పెట్టారు..

దొడ్డిదారిన అంధత్వ ధ్రువీకరణ పత్రం పొందారనే వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు.. తాత్కాలికంగా నిలిపి వేశారు. ఈ అంధత్వ ధ్రువీకరణ పత్రాలు సరైనవేనా అనే దానిపై స్పష్టత కోసం హైదరాబాద్‌లో ఉన్న సరోజినిదేవి కంటి ఆసుపత్రికి క్లారిఫికేషన్ కోసం రాశారు. రాజకీయ పలుకుబడి, విద్యా, వైద్యశాఖలో తనకున్న బంధుమిత్రుల సంబంధాలతో అంధత్వ సర్టిఫికెట్ పొందారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి వారి వల్ల అర్హులైన అంధులకు అన్యాయం జరుగుతుందని దివ్యాంగుల సంఘాలు ఫిర్యాదు చేశాయి.

విమర్శలకు దారితీస్తున్న అధికారుల తీరు

దొడ్డిదారిన పదోన్నతులపై వచ్చిన ఫిర్యాదుల విషయంలో జిల్లా విద్యాశాఖ అనుసరించిన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంధత్వ ధ్రువీకరణ పత్రం సరైనదేనా? కాదా? స్పష్టత ఇవ్వాలని సరోజినిదేవి కంటి ఆసుపత్రికి పంపాల్సిన లేఖను ఏకంగా ఫిర్యాదు అందిన వ్యక్తి చేతికే ఇచ్చి పంపినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ఏదైనా ప్రభుత్వ ఉద్యోగిపై ఫిర్యాదు అందితే.. దానిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలంటే రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ, ఆయా శాఖ మెయిల్ ద్వా రా గానీ జరపాలి. కానీ ఫిర్యాదులు వచ్చిన వ్యక్తి చేతికే క్లారిఫికేషన్ లేఖలు ఇవ్వడం గమనార్హం.

వివరాలు ఇచ్చేందుకు నిరాకరణ

పదోన్నతులపై వచ్చిన ఫిర్యాదుల వివరాలు ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సిబ్బంది నిరాకరించడం గమనార్హం. పదోన్నతుల విషయంలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి..? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు వంటి వివరాల కోసం డీఈఓ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ సిబ్బందిని 'సాక్షి' సంప్రదించగా., వివరాలు ఇవ్వకుండా దాటవేయడం గమనార్హం.

క్లారిటీ వచ్చాకే ఆర్డర్ ఇచ్చాం



దివ్యాంగుల కోటా పదోన్నతికి సంబంధించి ఫిర్యాదు అందింది. దీంతో ఈ పదోన్నతిని హోల్డ్‌లో పెట్టాం. వెరిఫికేషన్ కోసం హైదరాబాద్‌లో ఉన్న సరోజినిదేవి కంటి ఆసుపత్రికి రాశాం. అక్కడి నుంచి క్లారిటీ వచ్చాకే ప్రమోషన్ ఆర్డర్ ఇచ్చాం.

: వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖాధికారి



జోగిపేట ఆసుపత్రిలో ల్యాబ్ వద్ద కిక్కిరిసిన రోగులు

వైరల్ పరీక్ష



ల్యాబ్‌లో రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

జోగిపేట ఆస్పత్రికి తరలివచ్చిన రోగులు

జోగిపేట ఏరియా ఆస్పత్రిలో వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న వారంతా రక్త నమూనా, యూరిన్ టెస్టుల కోసం ఎగబడ్డారు. సోమవారం సుమారుగా వెయ్యికి పైగా ఓపీ పేషెంట్‌లు నమోదయ్యారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చాలా మంది జ్వరాల బారిన పడ్డారు. పరీక్షించిన వైద్యులు.. అందరికి టెస్టులకు రాయడంతో ల్యాబ్ వద్ద వందల సంఖ్యలో గుమిగూడారు. వాగ్వాదం.. తోపులాటతో గందరగోళం ఏర్పడింది. ఒకేసారి ఐదుగురు రోగులకు చొప్పున పిలిచి పరీక్షలు నిర్వహించారు.

– జోగిపేట(అందోలు)



కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల నిరసన

సీపీఎస్ రద్దయ్యే వరకు పోరాటం ఆగదు

- ఉపాధ్యాయ సంఘాల జేఏసీ
- పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సీపీఎస్ అంతం అయ్యేదాకా ఉపాధ్యాయుల పోరాటం ఆగదని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ స్పష్టం చేసింది. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదురుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని (సీపీఎస్) ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ సీపీఎస్ పథకం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట పెనుశాపంగా మారిందని మండిపడ్డారు. ఈ సీపీఎస్ పథకంలో ఉద్యోగుల భాగస్వామ్యంతో ప్రతి నెల పది శాతం వేతనం నుంచి మినహాయిస్తారని, దానికి తోడు ప్రభుత్వం కూడా పది శాతం ఉద్యోగుల ఖాతాలలో జమ చేస్తుందన్నారు. ఇలా జమ అయినా మొత్తాలను షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుందన్నారు. దీంతో షేర్ మార్కెట్ విలువల మీద ఉద్యోగుల పెన్షన్ ఆధారపడి ఉంటుందని వాపోయారు. సీపీఎస్ ఉద్యోగులు రిటైర్ అయితే రెండు, మూడు వేల పెన్షన్ మాత్రమే వస్తుందని చెప్పారు. ఉద్యోగం విరమణ తర్వాత సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి దుర్భరంగా తయారవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు వై.అశోక్ కుమార్, సయ్యద్ అలీ, సోమశేఖర్, రామచందర్, ప్రసాద్, దుర్గయ్య చంద్రశేఖర్, అబ్దుల్లా, అజ్మతుల్లా, గోపాల్, పుండరికం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు

సోయాబీన్ ఎదుగుదల ఇలా..

డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

జహీరాబాద్: సోయాబీన్ పంట ఎదుగుదలకు గాను డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని దిడిగి గ్రామ శివారులో గల కేవీకేలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కంగ్టి మండలాల్లోని హుగ్గెల్లి, తూంకుంట, బుర్దిపాడ్, సత్వార్, కొత్తూర్(బి), రేజింతల్, మెటల్‌కుంట, కుప్పానగర్, గౌసాబాద్ తండా, దెగుల్‌వాడి గ్రామాలకు చెందిన రైతులకు సామూహిక ప్రదర్శన క్షేత్రాలలో భాగంగా సోయాబీన్ పంట ఎదుగుదల, పురుగుల నివారణకు సంబంధించిన 250 ఎకరాలకు కావాల్సిన జిగురు అట్టలు, పంచగవ్య 1,250 లీటర్లు, దశపర్ణి కషాయం 1,500 లీటర్లు, వేపనూనె 150 లీటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త స్నేహలత మాట్లాడుతూ.. తెగుళ్లు, పురుగుల నివారణకు పసుపుపచ్చ, నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 12 వరకు అక్కడక్కడ అమర్చడం ద్వారా తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులను నివారించుకోవచ్చని వివరించారు. మట్టి విభాగం నిపుణుడు ఇ.స్వామి మాట్లాడుతూ సోయాబీన్ పంటలో ఎరువుల యాజమాన్యంలో భాగంగా 19:19:19 వేసుకోవాలని, పంచగవ్య 16 రకాల పోషకాలు కలిగి ఉంటుందని, మొక్క ఎదుగుదలకు, రోగ నిరోధక శక్తి పెంచుతుందన్నారు. కార్యక్రమంలో పది గ్రామాల రైతులు, వ్యవసాయ యూనివర్శిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి జోన్: పోటీ పరీక్షల కొరకు నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4 తో పాటు ఆర్.ఆర్.బి, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షల కొరకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యం గల శిక్షకులతో నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. బీసీ సంక్షేమ అధికారి జగదీష్, సర్వే ఏడీ ఐనేష్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 44 అర్జీలు

కాగా, కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 44 అర్జీలు సమర్పించారు. అధికంగా రెవెన్యూ సమస్యలే వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్‌ఓ పద్మజ రాణి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



సింగూరు నుంచి నీటిని విడుదల చేసిన అధికారులు

సింగూరుకు పోటెత్తిన వరద

ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. సోమవారం ప్రాజెక్టు 7 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 79,814 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఏడు గేట్ల ద్వారా దిగువకు నీటిని వదులుతున్నారు.

– పుల్‌కల్(అందోల్)

పొలాల్లో నీరు నిల్వ ఉండొద్దు

- వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌కుమార్
- నీట మునిగిన పంటల పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దీంతో కొంత మేరకు పంట నష్టాన్ని నివారించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని మొల్కన్‌పాడ్ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట పడిపోకుండా ఉండేందుకు మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలని సూచించారు. పొలంలోంచి నీరు వెళ్లేందుకు 40 సెంటీ మీటర్ల లోతు, 60 సెంటీ మీటర్ల వెడల్పు ఉండేలా కాల్వలు తీయాలన్నారు. తెగుళ్ల నివారణకు మోనోక్రోటోపాస్, లేదా క్లోరి పైరిపాస్ మందును తగిన మోతాదులో పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కాగా, మండల పరిధిలోని చాల్కి, చీకూర్తి, హుస్సేన్ నగర్ తదితర గ్రామాల శివారులో నీట మునిగిన పంటలను ఏఈఓలు పరిశీలించారు. ఎగువ ప్రాంతమైన కర్నాటక నుంచి మంజీరలో పెద్ద ఎత్తున వరద వచ్చి చేరడంతో సుమారు 300 ఎకరాల్లో పత్తి, పెసర, మినుము తదితర పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ తెలిపారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

కలుపు కష్టాలు!

పొలాల్లో పెరిగిపోతున్న కలుపుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీలకు డిమాండ్ పెరగడంతో సకాలంలో కలుపుతీయని కారణంగా వర్షాలకు చేలన్నీ బీళ్లుగా మారుతున్నాయి. కలుపు తీసేందుకు కూలీలు దొరక్క పైగా రేట్లు పెంచడం వల్ల పెట్టుబడులు పెరిగి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

– జహీరాబాద్ టౌన్

కూలీలకు డిమాండ్

- పెరిగిన పెట్టుబడులు
- రైతుల ఆందోళన

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పత్తి, సోయాబిన్, పెసర, కంది, మినుము తదితర పంటలను సాగు చేశారు. సుమారు 80 వేల ఎకరాల్లో పత్తి, 55 వేల ఎకరాల్లో సోయాబిన్, 6,724 ఎకరాలో మినుము, 7,589 ఎకరాల్లో పెసర పంట సాగవుతుంది. పంటలు ఆశాజనకంగా ఉండగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలతో పాటు కలుపు మొక్కలు పెరిగాయి. పత్తి. సోయాబిన్, మినుము, మొక్కజొన్న, పెసర, కంది చేలల్లో విపరీతంగా కలుపు పెరడంతో నివారణకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి చేన్లలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో నీటి తడి ఆరకుండా మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వెసులుబాటు లేక కలుపు తీసేందుకు కూలీలు దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరత వల్ల కొంత మంది కలుపు నివారణ మందులపై ఆధారపడుతున్నారు. కూలీల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నట్లు రైతులు వాపోతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో దినసరి కూలీ రూ. 500 ఉండగా రూ.600 చెల్లించాల్సి వస్తుంది. ఎకరం పొలంలో కలుపు తీసేందుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది.



పెసర చేనులో పెరిగిన కలుపు మొక్కలు

సకాలంలో సస్యరక్షణ చేపట్టాలి



మొక్కల మధ్యన కలుపును పూర్తిగా నివారిస్తేనే దిగుబడులు పెంచుకునేందుకు ఆస్కారం ఉంది. దీంతో పొలాల్లో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పత్తి కాయ అభివృద్ధి దశలో ఉంది. పొలాల్లో చేరిన మురుగునీరును తొలగించాలి. తొందరగా అంతర కృషి చేసుకోవాలి. మొక్కజొన్న కంకి దశలో ఉంది. ఎక్కువ నీటికి పంట తట్టుకోలేదు. అందుకని వెంటనే పొలం నుంచి నీటిని తొలగించాలి. క్షేత్రస్థాయిలో తిరుగుతున్న వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

క్లుప్తంగా

మందేసి.. చిందేసిన అధికారులు



మంజీరా ఫిల్టర్ బెడ్ కార్యాలయంలో మందు సేవిస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): అధికారులు మందు తాగి చిందులేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... బోరుపట్ల గ్రామ శివారులోని మంజీరా ఫిల్టర్ బెడ్‌లో నీటి సరఫరా గ్రిడ్ కాంట్రాక్టర్, అధికారులు సోమవారం రాత్రి మందేసి చిందులేశారు. రెండు, మూడు రోజుల నుంచి తాగు నీరు రాక హత్నూర, నర్సాపూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఫిల్టర్ బెడ్‌లో మందు తాగుతూ చిందులేసారని బోరుపట్ల గ్రామస్తులు తెలిపారు. ఏకంగా ప్రభుత్వ కార్యాలయాన్ని బార్‌గా మార్చుకొని మద్యం తాగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్‌లో సాయంత్రం ఆరు తర్వాత స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్నారని, ఎవరిని ఇబ్బంది పెట్టలేమని గ్రిడ్ కాంట్రాక్టు మేనేజర్ జగపతిబాబు స్థానికుల సమక్షంలోనే తెలుపడం గమనార్హం. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్‌లోనే మందు తాగుతూ చిందులేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్షుద్ర పూజల కలకలం



కళాశాల ఎదుట క్షుద్ర పూజల ఆనవాళ్లు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కలకలం రేపాయి. సోమవారం ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అధ్యాపకులు పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్డు, నిమ్మకాయలు, గాజులు, పసుపు కుంకుమతో ముగ్గు వేసినట్లు గుర్తించారు. ఆ తరువాత సిబ్బందితో శుభ్రం చేయించారు. ఇదే విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కోరగా.. పూజలు చేసిన ఆనవాళ్లను తొలగించామన్నారు. సీసీ కెమెరాలు, వీధి దీపాలు, ప్రహరీ గోడ కూలి పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాలకు అవరమైన రక్షణకోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి



పట్టుబడిన వారితో పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పేకాట ఆడుతున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా... మండల పరిధిలోని మెట్‌పల్లిలో ఆదివారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7 ఫోన్‌లు, బైక్‌లు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సైఫ్ అలీ తెలిపారు.

జహీరాబాద్‌లో ..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మస్తాన్ కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద రూ.15,800 నగదు, పేకాట ముక్కలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, సుమోటో కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్‌ఐ. వినయ్‌కుమార్ తెలిపారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ తెలిపాడు. ఆదివారం రాత్రి పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి రైడ్ చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,200 నగదు, మూడు ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హుస్నాబాద్‌రూరల్: పదిహేను రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలోని పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కాయిత నవీన్ రెడ్డి(30) ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్నాడు. అతడు రాత్రి ఇంటికి వచ్చే క్రమంలో పాఠశాల ఎదుట మలుపు తిరుగుతుండగా ప్రమాదవశాత్తు స్కూటీ అదుపుతప్పి కిందపడి తలకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసినా నవీన్‌లో కదలిక లేకపోవడంతో రెండు రోజుల కిందటే ఇంటికి తీసుకురాగా చనిపోయాడు. పోతారం(ఎస్) గ్రామం నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు ఓవర్ లోడ్‌తో వెళ్లడంతోపాటు రోడ్డుపై మట్టిపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

ఆర్టీసీ డ్రైవర్.. నో ఫోన్



బస్సు నడిపే వేళ నిషేధం విధిస్తూ సంస్థ నిర్ణయం

- ప్రయోగాత్మకంగా మెదక్ రీజియన్ సంగారెడ్డిలో ప్రారంభం
- ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా చర్యలు

ప్రయాణికుల భద్రతను మరింత పటిష్టం చేసే చర్యల్లో భాగంగా ఆర్టీసీ సంస్థ డ్రైవర్లకు సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధిస్తూ చర్యలు చేపట్టింది. విధినిర్వహణలో ఉన్న డ్రైవర్ తన వద్ద సెల్‌ఫోన్ కలిగి ఉండకుండా చూస్తుంది. ప్రయోగాత్మకంగా మొదట 11 డిపోల్లో అమలు చేస్తుంది. విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుంది.

– నారాయణఖేడ్

మెదక్ రీజియన్‌లో సంగారెడ్డి డిపోలో పైలెట్ ప్రాజెక్టుగా సోమవారం నుంచి ప్రారంభించింది. ఈ డిపోలో విధులు నిర్వహిస్తున్న 161మంది డ్రైవర్లు డ్యూటీ సమయంలో సెల్‌ఫోన్‌ను డిపోలో డిపాజిట్ చేసి వెళ్తున్నారు. బస్సు నడుపుతున్న సమయంలో డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వల్ల జరిగే ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఈ నిబంధన అమలు చేస్తుంది. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రీజియన్ పరిధిలోని 8 డిపోల్లో అమలు చేయనుంది. ఈ డిపోల పరిధిలో 569 సర్వీసులకు గాను 577మంది డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు.

భద్రతకు ప్రాధాన్యం..

విధుల్లో ఉన్న సమయంలో కొందరు డ్రైవర్లు సెల్‌ఫోన్లు వాడుతున్నట్లు ఆర్టీసీ విజిలెన్స్ విభాగం తనిఖీల్లో వెల్లడైంది. ఇది ప్రయాణికుల భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తుందని భావిస్తూ యాజమాన్యం సెల్‌ఫోన్ వినియోగం నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధన ప్రకారం డ్రైవర్లు విధులకు హాజరైన వెంటనే సెల్‌ఫోన్‌లను డిపోలో ఏర్పాటు చేసిన ప్రత్యేక లాకర్‌లో భద్రపర్చాలి. విధులు పూర్తయిన తర్వాత తమ ఫోన్లను తిరిగి తీసుకోవాలి. ఒకవేళ డ్రైవర్‌కు ఏదైనా అత్యవసర సమాచారం అందించాల్సి వస్తే అధికారులు లేదా వారి కుటుంబ సభ్యులు సంబంధిత బస్సు కండక్టర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కండక్టర్ ద్వారా ఆ సమాచారాన్ని డ్రైవర్‌కు చేరవేసేలా ఏర్పాట్లు చేశారు.

డ్రైవర్లకు పరీక్షలు

ఇప్పటికే ఆర్టీసీ ప్రయాణికుల భద్రత దృష్ట్యా పలు చర్యలు చేపట్టింది. ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు రెగ్యులర్‌గా డ్రైవింగ్ పరీక్షలు చేసి, తగు శిక్షణ ఇస్తున్నారు. రెండు నెలలకోసారి సంగారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు హకీంపేట్‌లో ఆరు నెలలకోసారి డ్రైవింగ్ పరీక్ష కూడా పెడుతున్నారు. ప్రతి డిపోలో డ్యూటీకి వెళ్లే సమయంలో డ్రైవర్‌కు బ్రీతింగ్ పరీక్ష నిర్వహిస్తున్నారు. 45 ఏళ్లు నిండిన డ్రైవర్లకు ఏడాదికి ఒకసారి, 45 ఏళ్లలోపు వారికి మూడేళ్లకు ఒకసారి జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు చేస్తారు. ఆరోగ్యంగా ఉంటేనే వారిని విధులకు పంపిస్తారు. తెల్లవారుజామున విధులకు వెళ్లే డ్రైవర్లు రాత్రి వచ్చి పడుకునేందుకు, డబుల్ డ్యూటీకి వెళ్లే వారు విశ్రాంతి తీసుకొనేందుకు ప్రతి డిపోలో రెస్టు రూంలు ఏర్పాటు చేశారు. ఏవైనా పండుగల సందర్భంలో స్పెషల్ బస్సులు నడిపే క్రమంలో ఆహారం అందజేస్తున్నారు.

అమలు ప్రారంభం



సంగారెడ్డి డిపోలో డ్రైవర్లకు సెల్‌ఫోన్ వాడకంపై నిషేధాన్ని ప్రారంభించాం. డ్రైవర్లే సంతోషంగా సెల్‌ఫోన్‌ను ఇచ్చి విధులకు వెళుతున్నారు. ఇది మంచి నిర్ణయంగా స్వాగతిస్తున్నారు. ప్రయాణికులు, ప్రజల భద్రత, కార్మికుల సంక్షేమం కోసం సంస్థ పాటుపడుతుంది.

– విజయభాస్కర్, ఆర్‌ఎం, సంగారెడ్డి

ఖాళీ బిందెలతో నిరసన



ధర్మాసాగర్ తండా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న తండావాసులు

తాగునీటి కోసం రాస్తారోకో

కౌడిపల్లి(నర్సాపూర్): తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని ధర్మాసాగర్ గేట్ తండావాసులు సోమవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలో నాలుగు నెలలుగా తాగునీటి సమస్య ఉందని, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కొంతకాలంగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పాటు తండాలో సింగిల్ ఫేజ్ బోరుబావులు లేకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నీటి కోసం వ్యవసాయ బోర్ల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తండాలో తాగునీటి సమస్య అధికమైందని, అధికారులు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని తండావాసులకు నచ్చజెప్పారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో తండావాసులు ధర్నా విరమించారు.

కోమా నుంచి కోలుకునే దాకా..

- బాలిక ప్రాణాలు కాపాడిన వైద్యులు
- పాము కాటుకు గురై..
- నెల రోజుల పాటు వైద్యం.. డిశ్చార్జి



కోలుకున్న చిన్నారితో వైద్యులు

సిద్దిపేటకమాన్: పాము కాటుకు గురై కోమాలోకి వెళ్లిన బాలికకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారు. నెల రోజుల పాటు చికిత్స అందించి కోలుకున్న తర్వాత డిశ్చార్జి చేశారు. ఈ ఘటన సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత వివరాలు వెల్లడించారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన గంగరవేని శ్రీనివాస్, అంజలి దంపతుల రెండో కూతురు శ్రీజ (10) ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతుంది. జులై 31న అర్ధరాత్రి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో ఆమె కుడి చేతిపై కట్లపాము కాటు వేసింది. వెంటనే పాపను బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన చిన్న పిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సురేశ్‌బాబు, అనస్తీషియా వైద్యుడు చందర్.. పాప శరీరంలో విష ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల ద్వారా గుర్తించారు. అప్పటికే పాప అపస్మారక స్థితిలోకి వెళ్లడం, నరాల బలహీనత, గుండె, మెదడుపై విష ప్రభావం వల్ల మాట్లాడలేకపోయినట్లు గమనించారు. పాపకు సీపీఆర్ సైతం చేశారు. 10రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి ప్రతిరోజు ప్రత్యేక వైద్య సేవలందించినట్లు తెలిపారు. పాప కాస్త కోలుకోవడంతో వెంటిలేటర్‌ను తొలగించి 30రోజుల పాటు చికిత్స అందించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉందని, సోమవారం డిశ్చార్జి చేశారు. దీంతో పాప తల్లిదండ్రులు వైద్యాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ అభినందించారు. సీఎస్ఆర్ఏంఓ డాక్టర్ జ్యోతి, శ్రావణి, వైద్యులు చందర్, సురేశ్‌బాబు, అనుపమ, రాగిని, రమ్య, రవి, స్నిగ్ధ, గ్రీష్మ, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా



రాయపోల్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

తెల్లవారక ముందే యూరియా కోసం రైతులు పరుగులు పెడుతున్నారు. పనులన్నీ వదులుకొని కుటుంబ సమేతంగా వచ్చి గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచున్నా యూరియా దొరకట్లేదని వాపోతున్నారు. మూడు, నాలుగు రోజులుగా ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరుగుతూ అలసిపోయిన రైతులు సోమవారం మండల కేంద్రంలో యూరియా కోసం ధర్నా చేశారు. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ఎస్‌ఐ మానస, ఏవో నరేశ్ ధర్నా వద్దకు చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి యూరియా తెప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

– దుబ్బాకటౌన్:

ఇంట్లో బంగారం చోరీ

జహీరాబాద్ టౌన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ.వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మున్సిపల్ పరిధిలో గల ఆదర్శనగర్ కాలనీకి చెందిన శోభారాణి ఇల్లు బైపాస్ రోడ్డుకు దగ్గరలో ఉంది. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికెళ్లారు. ఆదివారం రాత్రి తలుపులు, తాళాలు పగులగొట్టి దొంగలు ఇంట్లో చొరబడ్డారు. బీరువాలోని 2 తులాల బంగారం, 4 తులాల వెండి, రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూసి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్‌తో పోలీసులు వివరాలు సేకరించారు.

ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి..



భవనంపై నుంచి పడిన మాసుల రాజు

నిజాంపేట(మెదక్): భవనం పైనుంచి కింద పడిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... సోమవారం నందిగామ గ్రామంలో చర్చి భవన నిర్మాణంలో భాగంగా 4వ అంతస్తులో పనులు చేస్తుండగా మండలానికి చెందిన మాసుల రాజు కాలు జారి కింద పడిపోయాడు. దీంతో అతనికి రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

అంజనీదేవిని ఆపిందెవరు?

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఈవో అన్నపూర్ణ శనివారం పదవీ విరమణ పొందింది. దీంతో దేవాదాయ శాఖలో జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారిగా (అసిస్టెంట్ కమిషనర్) గా విధులు నిర్వహిస్తున్న అంజనీదేవికి రెండు రోజుల క్రితం ఈఓగా నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె విధుల్లో చేరేలోపే దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను మార్చి డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్‌ను కొమురవెల్లి ఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు సోమవారం జారీ చేసింది. వెంకటేశ్‌ను నియమించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో వెంకటేశ్ కొమురవెల్లిలో ఈఓగా పనిచేసిన సమయంలో పలు వివాదాలు చోటు చేసుకోవడంతో సెలవుపై వెళ్లాడు. గతంలో మాదిరిగా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేస్తాడా? లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మురుగుకాల్వలకు నిధులు

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిమ్మాపూర్ గ్రామంలో మురికి కాల్వలకు నిధులు కేటాయిస్తున్నట్లు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. సోమవారం గ్రామస్తులు కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామంలో మురికి కాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించామని తెలిపారు. వెంటనే నిర్మాణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత అధికారులకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. గ్రామంలో విష జ్వరాలపై శాంపిల్స్‌ను సేకరించామని, అలాగే ఇటీవల జ్వరంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యుల నుంచి కూడా శాంపిల్స్ సేకరించామన్నారు. శాంపిల్స్‌ను పుణేకు పంపించినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొంపాక(గజ్వేల్): సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. కొండపాక పీహెచ్‌సీని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ రిజిష్టర్, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారి శ్రీధర్, ఆయుష్ డాక్టర్ రజనీ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



భాగ్యలక్ష్మి

జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు.

పటాన్‌చెరు టౌన్: స్నేహితురాలితో షాపింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారానికి చెందిన భాగ్యలక్ష్మి (19) ఇస్నాపూర్‌లోని చిట్కుల్‌లో ఉండే మామ సంతోష్ కుమార్ ఇంటికి వారం క్రితం వచ్చింది. ఈనెల 30న స్నేహితురాలు చిట్కుల్‌కు రావడంతో ఇద్దరు కలిసి లింగంపల్లిలో షాపింగ్‌కు వెళ్తామని చెప్పి బయలు దేరారు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. మామ సంతోష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బయటకు వెళ్లిన బాలిక..

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం ... ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం బండ గ్రామానికి చెందిన పెంటయ్య రెండో కూతురు శాంతి (14) సోమవారం ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అమీన్‌పూర్‌లో మహిళ..



జానకిలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, గూడూరు మండలం పోలవరానికి చెందిన మోహన్ కుమార్ బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీలో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా నాలుగు నెలల క్రితం మోహన్ తండ్రి రామేశ్వరరావు మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి డిప్రెషన్‌కు లోనైన నాగవర జానకిలక్ష్మి కుమారుడు మోహన్ దగ్గర ఉంటుంది. కాగా ఇటీవల సొంత గ్రామానికి వెళ్తానని కుమారుడిని తల్లి అడగగా వర్షాలు పడుతున్నాయి, రెండు రోజులు ఆగి పంపుతానని చెప్పాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంట్లో తల్లి కనిపించలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫౌంటేన్‌లో పడి యువకుడి మృతి



శశిధర్



చౌరస్తా ఫౌంటేన్‌లో పడి ఉన్న మృతదేహం, బైక్

సిద్దిపేటకమాన్: వాటర్ ఫౌంటేన్‌లో బైకుతో సహా పడిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన ఆకుల రవీందర్, అపర్ణ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు ఆకుల శశిధర్ (23) పట్టణంలోని ఓ మొబైల్ షాప్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం విధులకు వెళ్లాడు. రాత్రి ఇంటికి ఫోన్ చేసి వినాయక నిమజ్జనం ఉందని, ఆలస్యం అవుతుందని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు చెప్పాడు. అర్ధరాత్రి తండ్రి శశిధర్‌కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో అతని స్నేహితులు, బంధువుల దగ్గర ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలోని ఫౌంటేన్‌లో మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు బయటకు తీసి శశిధర్‌గా గుర్తించారు. రాత్రి వినాయక నిమజ్జనం వేడుకల అనంతరం శశిధర్ తన యమహా బైక్‌పై ఇంటికి వెళుతూ ఫౌంటేన్‌లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నీటిలో మృతదేహం, బైక్ పూర్తిగా మునిగి ఉండటంతో జన సంచారం ఉన్న ప్రాంతమైనా ఎవరూ గుర్తించలేదని పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

ఇంటి బిల్లు రాలేదని పెట్రోల్ పోసుకున్న గ్రామస్తుడు



పాలమాకులలో విచారణ జరుపుతున్న ఎంపీఓ

నంగునూరు(సిద్దిపేట): పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేస్తున్న క్రమంలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఘటన సోమవారం పాలమాకులలో కలకలం రేపింది. వివరాలు ఇలా.. గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిత విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, గ్రామస్తులు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం నారాయణరావ్‌పేట ఎంపీఓ శ్రీనివాసరావు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ప్రొసిడింగ్ ఇవ్వలేదని నూనె కుమారస్వామి అధికారుల దృష్టికి తీసుకొచ్చాడు. అలాగే కార్యదర్శి గ్రామసభ నిర్వహించడం లేదని, అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన యాదండ్ల నారాయణ గత ప్రభుత్వంలో తనకు ఇల్లు మంజూరై నిర్మించుకున్నానని, ఇప్పటి వరకు బిల్లు రాలేదని అధికారులను నిలదీశాడు. ఒక్కసారిగా పెట్రోల్ బాటిల్ తీసి ఒంటిపై పోసుకుంటున్న క్రమంలో గ్రామస్తులపై పడటంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే గ్రామస్తులు అతన్ని బయటకు పంపించడంతో పెను ప్రమాదం తప్పింది.

ఏ ఎన్నిక ముందు.!

- గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై జోరుగా చర్చ
- అయోమయంలో నాయకులు



దౌల్తాబాద్ గ్రామపంచాయతీ భవనం వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ లిస్టు

హత్నూర(సంగారెడ్డి): ఏ ఎన్నిక ముందు.. అసలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొస్తాయి? ప్రభుత్వం రోజుకో లీకుతో గ్రామస్థాయిలో నాయకులు అయోమయంలో పడ్డారు. జిల్లాలో 613 గ్రామపంచాయతీలకు 5370 వార్డులు, 271 ఎంపీటీసీ స్థానాలు, 25 ఎంపీపీలు , జెడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఓటరు జాబితాను సైతం గ్రామాల్లో ఏర్పాటు చేసింది. అలాగే ఎంపీటీసీ ఎన్నికలకు ఓటర్ లిస్టును అధికారులు సిద్ధం చేశారు. కానీ ఏ ఎన్నికలు ముందు వస్తాయో ప్రభుత్వం తేల్చకపోవడంతో మండల, గ్రామస్థాయి నాయకులు విస్తృతంగా చర్చలు జరుపుతున్నారు. ముందు ఏ ఎన్నిక వచ్చినా పోటీ చేయాలన్న ఆలోచనలో నాయకులు ఉన్నారు. మరి కొందరు ఎంపీటీసీ వస్తే పోటీ చేద్దామని ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాలేదు, ఎప్పుడు ఏ ఎన్నిక పెడతారో తెలియక నాయకులు అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం ముందుగా ఏ ఎన్నిక నిర్వహిస్తుందో ఎదురు చూడాల్సిందే.

గ్రామాల్లో వేడెక్కిన రాజకీయం

ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోటీ చేయాలనే ఆశతో ఉన్న కొంతమంది నాయకులు నియోజకవర్గస్థాయి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తే తనకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ టికెట్ ఇవ్వాలంటూ గ్రామ, మండల స్థాయి నాయకులు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో పావులు కదుపుతున్నారు. రిజర్వేషన్ ఏది వస్తుందో తెలియదు కానీ గ్రామాల్లో మాత్రం ఇప్పుడే రాజకీయ సందడి మొదలైంది.